క్లుప్తంగా

ముదిరాజ్‌ల ఐక్యతకు కృషి



నియామక పత్రం అందుకుంటున్న నర్సింలు

వెల్దుర్తి(తూప్రాన్): తెలంగాణ ముదిరాజ్ మహాసభ వెల్దుర్తి మండల అధ్యక్షుడిగా మండలంలోని శెట్టిపల్లి కలాన్ గ్రామానికి చెందిన శెట్టి నర్సింలును నియమించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని శాసన మండలి డిప్యూటీ చైర్మన్, రాష్ట్ర అధ్యక్షుడు డా.బండ ప్రకాష్ అందజేశారు. ఈ సందర్భంగా మండలంలో ముదిరాజ్‌లను ఏకతాటిపైకి తెచ్చి సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు నర్సింలు అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి ముదిరాజ్ ఉన్నారు.

బదిలీలు సాధారణమే



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు

మనోహరాబాద్(తూప్రాన్): ఉద్యోగ రీత్యా ఉద్యోగులు బదిలీలు సాధారణమేనని, కానీ 8 సంవత్సరాలు బోధన చేసిన విద్యార్థుల మదిలో నిల్చేలా విద్యకై హెచ్‌ఎం సత్యం కృషి చేశారని కాళ్లకల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వెంకటస్వామి అన్నారు. బుధవారం కాళ్లకల్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సత్యంకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనను ఉపాధ్యాయులు, విద్యార్థులు సత్కరించారు. బదిలీలో భాగంగా హెచ్‌ఎం సత్యం తూప్రాన్ మండలం ఇస్లాంపూర్‌కు బదిలీ అయ్యారన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దోమల నివారణకు చర్యలు



ఫాగింగ్ చేస్తున్న సిబ్బంది

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని ఖాజాపూర్ గ్రామంలో బుధవారం దోమల నివారణకు చర్యలు చేపట్టారు. గ్రామపంచాయతీ సిబ్బంది గ్రామంలోని మురికి కాల్వల పక్కన దోమల నివారణకు ఫాగింగ్ నిర్వహించారు. గ్రామంలోని అన్ని వార్డుల్లో ఫాగింగ్ చేసి, దోమల నివారణకు చర్యలు తీసుకున్నట్లు గ్రామ కార్యదర్శి ప్రభాకర్ తెలిపారు.

బీజేపీ నాయకుల ఇంటింటి ప్రచారం

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని ముప్పిరెడ్డిపల్లి, జీడిపల్లి గ్రామాల్లో బీజేపీ నాయకులు బుధవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్‌కు ఓటు వేసి భారీ మెజార్టీతో ఓటు వేసి దొరల పాలనకు చెక్ పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు కమ్మరి నరేందర్‌చారి, రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం ఉపాధ్యక్షుడు నత్తి మల్లేశ్, బీజేపీ నాయకులు వెంకటేశ్‌గౌడ్, నర్సింలు, వెంకటేశ్, నాగరాజు, సుధాకర్, సాయి, కృష్ణ, శ్రీశైలం తదితరులు ఉన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసు

శివ్వంపేట(నర్సాపూర్): ఎన్నికల నేపథ్యంలో అధికారులు ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేస్తున్నారు. మండల పరిధిలోని పోతారం చౌరస్తా వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద సిబ్బంది వాహనాలను క్షుణంగా పరిశీలిస్తున్నారు. తనిఖీ చేసే చోట సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అంబులెన్స్, ఆర్టీసీ బస్సులను సైతం అధికారులు తనిఖీ చేశారు.

భవనం నిర్మించేదెన్నడో?



రోడ్డు విస్తరణలో కూల్చివేసిన ఎంపీపీ కార్యాలయం(ఫైల్)



మొండిగోడలతో దర్శనమిస్తున్న ఎంపీపీ కార్యాలయం

- ఎంపీపీ కార్యాలయం కూల్చివేత
- మూడేళ్లు అయినా మంజూరుకాని నిధులు
- మొండి గోడల మధ్య విధుల నిర్వహణ
- దుమ్ముధూళితో అధికారుల సతమతం

అల్లాదుర్గం(మెదక్): జాతీయ రహదారి విస్తరణలో భాగంగా ప్రభుత్వ భవనాన్ని కూల్చి వేశారు. పరిహారం కూడా అంతంత మాత్రంగానే మంజూరు చేశారు. దీంతో నిధులు సరిపడ లేకపోవడంతో భవన నిర్మాణం పనులను చేపట్టడం లేదు. చేసేదేమీలేక కూల్చివేసిన భవనంలోని మిగిలిన గదుల్లోనే అధికారులు విధుల నిర్వహణను నెట్టుకొస్తున్నారు. ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో మూడేళ్లుగా మండల పరిషత్ కార్యాలయం మొండిగోడలతో దర్శనమిస్తోంది.

ప్రత్యామ్నాయం చూపని అధికారులు..

ఎంపీపీ కార్యాలయ భవనాన్ని కూల్చివేయడంతో మొండిగోడలతో రెండు గదులు మాత్రమే మిగిలాయి. దీంతో చాలీచాలని గదుల్లో దుమ్ముధూళిలోనే విధులు నిర్వహించాల్సిన దుస్థితి నెలకొంది. రోడ్డు విస్తరణలో భవనం కూల్చివేతకు గురవుతుందని అధికారులకు తెలిసినా ఏలాంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయలేదు.

నిధుల మంజూరుకు తీర్మానం..

కార్యాలయ భవనాన్ని నిర్మించాలంటే కోటి రూపాయల నిధులు అవసరమవుతుందని మండల సర్వసభ్య సమావేశంలో మూడేళ్ల క్రితమే తీర్మాణం చేసి ప్రభుత్వానికి పంపించారు. కానీ.. ఇప్పటివరకూ నిధులు మంజూరు కాకపోవడంతో నరకయాతన అనుభవిస్తూ విధులు నిర్వహిస్తున్నామని అధికారులు, సిబ్బంది వాపోతున్నారు. ఎంపీపీ భవన నిర్మాణంపై అధికారులు, ప్రజాప్రతినిధులు తమ కేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

నామమాత్రంగా పరిహారం మంజూరు..

ఎంపీపీ భవన నిర్మాణానికి పరిహారం కింద ప్రభుత్వం కేవలం రూ.18 లక్షలు మాత్రమే మంజూరు చేసి చేతులు దులుపుకుంది. ఈ నిధులతో ఎంపీపీ భవనం నిర్మించడం సాధ్యం కాదని, అదనపు నిధుల మంజూరు కోసం మళ్లీ ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినా ప్రయోజనం లేకుండాపోయింది.

కొనుగోలు కేంద్రాల పరిశీలన



ఇబ్రహీంపూర్ కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఏపీడీ భీమయ్య

చేగుంట(తూప్రాన్): మండలంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రాలను డీఆర్డీఓ ఏపీడీ భీమయ్య బుధవారం సందర్శించారు. ఇబ్రహీంపూర్ కొనుగోలు కేంద్రంలో నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తేమశాతం నిబంధనల ప్రకారం వచ్చిన ధాన్యం త్వరగా తీసుకోవాలని సూచించారు. రికార్డులను నిర్వహించాల్సిన పద్ధతులను కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఎం మోహన్ ఏపీఎం లక్ష్మీనర్సమ్మతో పాటు సీసీ, సీఏలు మహిళా సంఘం కమిటీ మెంబర్లు ఉన్నారు.

ప్రభుత్వ పథకాలు వివరించాలి

శివ్వంపేట(నర్సాపూర్): బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజల కోసం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత ప్రతీ కార్యకర్తపై ఉందని నర్సాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతారెడ్డి అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన కాంగ్రెస్ కార్యకర్తలు గోమారం గ్రామంలో బీఆర్ఎస్‌లో బుధవారం చేరారు. వారికి సునీతారెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, నాయకులు ఉన్నారు.

కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలి

రామాయంపేట(మెదక్): దుబ్బాక నుంచి పోటీలో ఉన్న బీఆర్ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేస్తూ నార్సింగి ఎంపీపీ సబిత, పార్టీ కార్యకర్తలు బుధవారం మండలంలోని నార్సింగి, నర్సంపల్లి పెద్ద తండాలో ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రతీ ఇంటికి అందుతున్నాయని, సీఎం కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రాగానే మరిన్ని సంక్షేమ పథకాలు అమలు చేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమంలో తండా సర్పంచ్ చత్రియా నాయక్, పార్టీ అధ్యక్షుడు భాషా నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలే కేసీఆర్‌ను గెలిపిస్తాయి

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో గజ్వేల్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కేసీఆర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మాజీ ఫుడ్స్ చైర్మన్ ఎలక్షన్ రెడ్డి, తూప్రాన్ మండల బీఆర్ఎస్ పార్టీ ఎన్నికల ఇన్‌చార్జి విద్యాసాగర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. గడపగడపకు వెళ్లి కేసీఆర్ చేపట్టిన సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించారు. కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి విద్యాసాగర్, మండల అధ్యక్షుడు బాబులు రెడ్డి, జెడ్పీటీసీ రాణి సత్యనారాయణగౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ భగవాన్ రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు గౌడ్, ఎంపీపీ వెంకటేశ్ యాదవ్, సర్పంచ్ మహదేవీ నవీన్, ఎంపీటీసీ వెంకటమ్మ, గ్రామ కమిటీ అధ్యక్షుడు మామిళ్ల స్వామి, సీనియర్ నాయకులు, ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బోధన అంశాలపై ఉపాధ్యాయులకు శిక్షణ



అవగాహన కల్పిస్తున్న సెంట్రల్ టీం సభ్యులు

మనోహరాబాద్(తూప్రాన్): మండలంలోని కాళ్లకల్ ఉన్నత పాఠశాలలోని స్కూల్ కాంప్లెక్స్‌ను సెంట్రల్ టీం సందర్శించి, మండల ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణను ఇచ్చినట్లు కాంప్లెక్స్ హెచ్‌ఎం వెంకటస్వామి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఎస్‌జీటీలకు పలు అంశాలు, బోధనారీతిపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ఎస్సీఈఆర్‌టీకీ అనుబంధంగా ఉన్న సెంట్రల్ రిసోర్స్ పర్సన్ నిహాంత్, మహేశ్‌లు హాజరై శిక్షణ నిచ్చారు. బోధన పద్ధతులు సరళంగా ఉండాలని అన్నారు. మోడల్ స్కూల్ బోధన, ఎఫ్‌ఎల్ఎన్ బోధన అన్ని పాఠశాలల్లో అమలు చేయాలని సూచించారు. మెదక్ జిల్లాను రాష్ట్రంలో ఉత్తమ జిల్లాగా ఉండేలా చూడాలని వివరించారు. ఈ కార్యక్రమంలో 39 మంది మండల ప్రాథమిక ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ

కొల్చారం(నర్సాపూర్): త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎస్ఐ మహమ్మద్ గౌస్ బుధవారం మండలంలోని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ.. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలింగ్ సమయంలో ఇబ్బందులు తలెత్తకుండా, భద్రతా చర్యల కోసం ముందస్తుగా పోలింగ్ కేంద్రాలను గుర్తించి, తనిఖీ చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి సమాచారం జిల్లా అధికారికి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంట సిబ్బంది ఉన్నారు.

11న 'చలో హైదరాబాద్'

వెల్దుర్తి(తూప్రాన్): ఈ నెల 11న హైదరాబాద్‌లో తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు యాదగిరిమాదిగ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రధాని మోదీ ముఖ్య అతిథిగా పాల్గొనే సమావేశంలో ఎస్సీ రిజర్వేషన్లు, ఏబీసీడీ వర్గీకరణపై సానుకూల స్పందన వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వర్గీకరణ బిల్లు ఈ శీతాకాల సమావేశాల్లోనే ప్రవేశపెట్టేలా చర్యలు తీసుకోవాలని ఆకాంక్షించారు. చలో విశ్వరూప మహాసభ విజయవంతం చేసేందుకు మాదిగ, మాదిగ ఉప కులాల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

గ్రామ కార్యదర్శిపై ఫిర్యాదు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని అంబాజీపేట గ్రామ కార్యదర్శిపై గ్రామ సర్పంచ్ సాయిలు ఎంపీడీఓకు ఫిర్యాదు చేశారు. గ్రామ అభివృద్ధి పనులకు వెచ్చించిన డబ్బులు డ్రా చేసి ఇవ్వడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దీంతో పాటు బిల్లులు రికార్డు చేయించడంతో పాటు ఎంబీ బుక్‌ను తన అధీనంలో ఉంచుకొని ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి దుర్గ భావానీపై చర్యలు తీసుకొని బిల్లుల చెల్లింపుకు సహకరించాలని కోరారు.

రిటైర్డ్ ఎంఈఓ విఠల్ మృతి



విఠల్

చిన్నశంకరంపేట(మెదక్): మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఎంఈఓ తారక విఠల్ అనారోగ్యంతో మృతి చెందారు. బుధవారం సికింద్రాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ.. మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. చిన్నశంకరంపేట, నార్సింగి, చేగుంట జెడ్పీపాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేయడంతో పాటు చేగుంట ఎంఈఓగా పని చేస్తూ పదవి విరమణ పొందారు. ఆయన అంత్యక్రియల్లో సర్పంచ్ రాజిరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొని నివాళులర్పించారు.

చేగుంట(తూప్రాన్): మండలంలో ఎంఈఓగా పనిచేసి పదవీ విరమణ పొందిన ఎంఈఓ విఠల్ మృతిపై పలు ఉపాధ్యాయ సంఘాల నాయకులు సంతాపం ప్రకటించారు. బుధవారం ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో వారిలో తపస్ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర కార్యదర్శి సురేశ్, రామారావు, జిల్లా నాయకులు దుబాషి భాస్కర్, ఎల్లం, లక్ష్మణ్, చక్రవర్తి, వెంకటేశ్, రేఖ, మల్లేశం, భాస్కర్‌రెడ్డి, సంతోశ్, కుమార్‌లు ఉన్నారు.

'ఆ వ్యక్తిపై చర్యలు తీసుకోండి'

గజ్వేల్‌రూరల్: పొలాల్లోకి వెళ్లకుండా ప్రహరీ నిర్మించి అడ్డుకుంటున్న రియల్ ఎస్టేట్ వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు కోరారు. ఈమేరకు బుధవారం మున్సిపల్ కమిషనర్ విద్యాధర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని క్యాసారం–ప్రజ్ఞాపూర్ పొలిమేరలో ఉన్న భూముల్లో 50 ఏళ్లుగా తాము వ్యవసాయం చేసుకుంటూ జీవనం వారు సాగిస్తున్నామన్నారు.

పాఠశాలలకు ఫర్నిచర్ అందజేత



వెంకటరత్నాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఫర్నిచర్ అందిస్తున్న నాయకులు

తూప్రాన్: ప్రభుత్వ పాఠశాలలకు ఓ ప్రైవేట్ పరిశ్రమ యాజమాన్యం ఫర్నీచర్‌ను అందించింది. మండలంలోని ఇస్లాంపూర్, వెంకటరత్నాపూర్, అంగాన్‌వాడీ కేంద్రాలకు ఫర్నీచర్‌ను మేడ్చెల్ జిల్లా రాజా బోల్లారంలోని రేగో ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమ యాజమాన్యం ఫర్నీచర్ అందజేశారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రజాప్రతినిధులు బుధవారం పాఠశాలల్లో విద్యార్థులకు అందజేశారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు పరిశ్రమ యాజమాన్యంకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వెంకట్‌రాంరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ సంతోష్‌రెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిమార్గాన్ని అనుసరించాలి



భూమి పూజ చేస్తున్న కృష్ణారావు

శివ్వంపేట(నర్సాపూర్): సమాజంలో ప్రతీ ఒక్కరు భక్తిమార్గాన్ని అనుసరించాలని బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు తూము కృష్ణారావు అన్నారు. మండల పరిధిలోని బీమ్లా పంచాయతీ టౌర్య తండాలో దాత రమేశ్‌రెడ్డి సేవాలాల్ మహారాజ్ ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చారు. అందుకు సంబంధించి ఆలయ నిర్మాణ భూమి పూజ బుధవారం చేశారు. ఈ కార్యక్రమంలో తండా వాసులు, భక్తులు పాల్గొన్నారు.

పోలీస్ తనిఖీల్లో మద్యం పట్టివేత



మద్యం స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

కొల్చారం(నర్సాపూర్): వాహనాల తనిఖీల్లో భాగంగా కారులో తరలిస్తున్న మద్యం కాటన్‌లను కొల్చారం పోలీసులు పట్టుకున్న సంఘటన రాంపూర్ గ్రామ శివారులోని మెదక్ నర్సాపూర్ ప్రధాన రహదారిపై బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మహమ్మద్ గౌస్ తెలిపిన వివరాల ప్రకారం.. రాంపూర్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా స్విఫ్ట్ డిజైర్ కార్ నెంబర్ టీఎస్ 15 ఈఆర్ 0222 డిక్కీలో రూ.19,800 విలువ గల 18 లీటర్ల లిక్కర్ బాటిళ్లను పట్టుకొని కేసు నమోదు చేశామని తెలిపారు.

స్వీయ రక్షణకు కరాటే దోహదం



ప్రతిభ చూపిన విద్యార్థులతో సినీ నటుడు సుమన్ తదితరులు

గజ్వేల్‌రూరల్: స్వీయరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని జేకేఏఐ(జపాన్ కరాటే అసోసియేషన్ ఆఫ్ ఇండియా) జిల్లా చీఫ్ కరాటే మాస్టర్ రాచకొండ ఆంజనేయులు పేర్కొన్నారు. మేడ్చల్‌లోని ప్రకృతి అవెన్యూలో ఇటీవల జరిగిన కార్యక్రమంలో జేకేఏఐ సంస్థ చైర్మన్, సినీ నటుడు డాక్టర్ సుమన్ తల్వార్ చేతుల మీదుగా ప్రతిభ చాటిన గజ్వేల్‌కు చెందిన విద్యార్థులు ప్రశంసపత్రాలు అందుకున్నారు. ఈసందర్భంగా బుధవారం గజ్వేల్‌లో కరాటే మాస్టర్ ఆంజనేయులు మాట్లాడుతూ విద్యార్థులకు కరాటేతో పాటు డబుల్ నాన్‌చాక్, కర్రసాము, జిమ్నాస్టిక్స్, యోగాసనాలు తదితర వాటిల్లో శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు.

అధికారుల నిర్లక్ష్యంతో గేదె మృత్యువాత



మ్యాన్‌హోల్‌లో పడి మృతి చెందిన పడిన గేదె



ఆందోళన చేస్తున్న రైతులు

పరిహారం ఇవ్వాలని రైతుల ఆందోళన

శివ్వంపేట(నర్సాపూర్): మిషన్ భగీరథ మ్యాన్‌హోల్ చాంబర్ హౌజ్‌పై కప్పు ఏర్పాటు చేయకపోవడంతో పాడిగేదె హౌజ్‌లో పడి మృత్యువాత పడిన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. శివ్వంపేట మండల పరిధిలోని పాంబండ గ్రామానికి చెందిన రైతు అక్కమొల్ల మల్లయ్య పాడిగేదెలతో జీవనోపాధి పొందుతున్నాడు. రోజుమాదిరిగానే పశువులను మేతకోసం గ్రామ శివారులోని వ్యవసాయ పొలాల వద్దకు తీసుకెళ్లాడు. గతంలో గ్రామాలకు తాగునీటి కోసం మిషన్ భగీరథ ద్వారా పైప్‌లైన్ ఏర్పాటు చేశారు. పైప్‌లైన్ ఏర్పాటు చేసిన సదరు కాంట్రాక్టర్ మ్యాన్‌హోల్ చాంబర్ హౌజ్‌పై పైకప్పు ఏర్పాటు చేయలేదు. ఈ క్రమంలో పాడి గేదె మేత మేసుకుంటూ మ్యాన్‌హోల్‌లో పడి మృతి చెందింది. దాని విలువ రూ.80వేలు ఉంటుందని బాధిత రైతు మల్లయ్య బోరున విలపించాడు. అధికారుల నిర్లక్ష్యంతోనే తన గేదె మృతి చెందిందని బాధిత రైతుకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఉసిరికపల్లి – వెల్దుర్తి ప్రధాన రహదారిపై రైతులు ఆందోళన నిర్వహించారు.

పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తా



చండూర్ శివారులో బోల్తాపడిన పంచాయతీ ట్రాక్టర్ ట్యాంకర్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మొక్కలకు నీళ్లు పడుతుండగా ట్రాక్టర్ ట్యాంకర్ బోల్తా పడిన సంఘటన మండలంలోని చండూర్ గ్రామ శివారులో బుధవారం చోటు చేసుకుంది. మండలంలో అన్ని గ్రామాల్లో సాధారణ ట్రాక్టర్ కొనుగోలు చేస్తే, చండూర్ పంచాయతీ పాలక వర్గ సభ్యులు మాత్రం చిన్న ట్రాక్టర్ కొనుగోలు చేశారు. ట్రాక్టర్ చిన్నది కావడంతో కనీసం ట్రాలీలోని చెత్తను, బురదలో సైతం నడవలేని పరిస్థితి. గతంలో కూడా ఇలా చాలాసార్లు జరిగింది. ప్రస్తుతం మొక్కలకు నీళ్లు పోస్తున్న సమయంలో చిన్న గుంతలో ట్యాంకర్ టైర్ పడడంతో ట్యాంకర్ బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవ్వరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు.

అభివృద్ధి కోసమే నా ఆరాటం

దుబ్బాక బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): నిరంతరం నియోజకవర్గ అభివృద్ధి కోసమే ఆరాటపడుతున్నానని దుబ్బాక ఎమ్మెల్యే అభ్యర్థి రఘునందన్‌రావు అన్నారు. మండలంలోని చిట్టోజిపల్లి, కర్నాల్‌పల్లి గ్రామాల్లో బుధవారం రఘునందన్‌రావు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దుబ్బాక నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యేగా గెలిచిన రెండున్నర ఏళ్ల కాలంలో నియోజకవర్గ అభివృద్ధి కోసం పని చేసినట్లు తెలిపారు. రెడ్డిపల్లి బైపాస్ వద్ద ప్రమాదాల నివారణ కోసం ఏడాదిన్నరలో జాతీయ రహదారిపై బ్రిడ్జి నిర్మించేందుకు ఎంతో కృషి చేశానని అన్నారు. అవకాశమిస్తే జాతీయ రహదారిపై ఉన్న చేగుంట మండలాన్ని మరింత అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటానని పేర్కొన్నారు. అనంతరం చిట్టోజిపల్లి ఉపసర్పంచ్ పద్మాపరశురాములు, వార్డు మెంబర్లు చిన్నగొండ స్వామి, శోభరమేశ్, కురమ పరశురాములు, ధనుంజయ్ భీంరావుపల్లి ఇస్తారమ్మ, నాగభూషణం, కసాన్‌పల్లి తండా మహిళలు వార్డు మెంబర్లు బీజేపీలో చేరారు.

విద్యుదాఘాతంతో డీసీఎం డ్రైవర్ మృతి

గజ్వేల్‌రూరల్: విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని దిలాల్‌పూర్‌లో బుధవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. రాయపోల్ మండలం తిమ్మకపల్లికి చెందిన జూకంటి గురువారెడ్డి(40)కి భార్య సుమ, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. గురువారెడ్డి రైతులు పండించే వివిధ రకాల ఉత్పత్తులను కొనుగోలు చేస్తూ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో దిలాల్‌పూర్‌లోని ఓ రైతు సాగుచేసిన కర్బూజను కొనుగోలు చేసి తరలించేందుకు బుధవారం వచ్చాడు. అక్కడ కర్బూజను డీసీఎంలో నింపుతుండగా... పైనున్న విద్యుత్ తీగలను గమనించకుండా డీసీఎంపైకి ఎక్కి సెల్‌ఫోన్‌లో మాట్లాడుతున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.